సాక్షి
శ్రీకాకుళం
శుక్రవారం ♦ 7 ♦ ఫిబ్రవరి ♦ 2025



ధరల 'భూ'తం

భూమి ధరల భూతం భయపెడుతోంది. పెంపుతో సామాన్యులకు ఇక్కట్లు తప్పవు.

- 8లో



అతి వేగానికి ఇద్దరు బలి

అల్లినగరం సమీపంలో రోడ్డు ప్రమాదం జరిగింది. ఇద్దరు యువకులు చనిపోయారు.

- 8లో

ఉద్దానంకు తాగునీటి పైప్‌లైన్లు

పాతపట్నం: ఉద్దాన ప్రజల తాగునీటి అవసరాలకు హిరమండలం గొట్టా బ్యారేజీ నుంచి పలాస, ఇచ్ఛాపురం వరకు తాగునీరు పైపులైన్లు వేయనున్నామని, పైప్‌లైన్ కోసం భూములు ఇచ్చే రైతులు ఇబ్బందులు పడకూడదని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ లావణ్య అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మండలంలోని ప్రహరాజపాలేం రెవెన్యూ భూముల రైతులతో ఆమె గురువారం సమావేశం నిర్వహించారు. భూముల ధరలను ప్రభుత్వం నిర్ణయిస్తుందన్నారు.

న్యూస్‌రీల్

రోడ్డు విస్తరణకు కేంద్రం ఆమోదం

టెక్కలి: జిల్లాలో డోలా–పోలాకి–నౌపడ (డీఎన్‌పీ) రోడ్డులో 56 కిలోమీటర్ల రోడ్డు విస్తరణకు కేంద్ర రోడ్డు రవాణా శాఖ రూ.103.20 కోట్లు కేటాయిస్తూ ఆమోదం తెలిపింది. ఈ మేరకు పౌర సంబంధాల శాఖ కార్యాలయం గురువారం విడుదల చేసిన ప్రకటనలో వివరాలు వెల్లడించారు. జిల్లాలో డీఎన్‌పీ రోడ్డుతో పాటు అంపురం–ఘతిమికుండాపురం మధ్య 11 కిలోమీటర్ల మేరకు రూ.23 కోట్లు కేటాయించినట్లు పేర్కొన్నారు. డీఎన్‌పీ రోడ్డును 16వ జాతీయ రహదారితో అనుసంధానం చేసే విధంగా నిధులు మంజూరు చేయడంతో పాటు 67 కిలోమీటర్ల మేర రోడ్డు విస్తరణకు రూ.126.20 కోట్లు కేటాయించినట్లు ప్రకటించారు. నరసన్నపేట, టెక్కలి, పలాస నియోజకవర్గాల్లో ఉద్దానం, సముద్ర తీరం, జాతీయ రహదారికి అనుసంధానంగా రోడ్డు విస్తరణ చేపడుతున్నట్లు వెల్లడించారు. మూలపేట పోర్టు సమీపంలో మరో ఎయిర్‌పోర్టు రానున్న నేపథ్యంలో ఈ రోడ్డు విస్తరణ ఎంతో కీలకంగా మారుతున్నట్లు తెలిపారు.

కేజీబీవీ ఆకస్మిక తనిఖీ



కేజీబీవీలో విద్యార్థినులతో కలిసి భోజనం చేస్తున్న జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్

పాతపట్నం: పాతపట్నం ఆల్‌ఆంధ్రా రోడ్డులో ఉన్న కస్తూర్బా గాంధీ విద్యాలయం(కేజీబీవీ)ని గురువారం జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. కేజీబీవీలో ఎంత మంది విద్యార్థినులు ఉంటున్నారు. వీరి భోజన సదుపాయాలు, స్టోర్ రూమ్‌లో ఉన్న సరుకులు స్టాక్ రికార్డును, భోజన గది, వంట పాత్రలు, వంటగది పరిసరాలు, ఆర్వో ప్లాంట్‌ను పరిశీలించారు. విద్యార్థినులతో మాట్లాడి వారితో కలిసి భోజనం చేశారు.

ఎక్సైజ్ కేసులు రాజీ చేయాలి



జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా

శ్రీకాకుళం పాతబస్టాండ్: జాతీయ లోక్ అదాలత్ మార్చి 8న జరగనుందని, ఈ అదాలత్‌లో ఎక్సైజ్ కేసులు ఎక్కువగా రాజీ చేయాలని, పెండింగ్‌లను తగ్గించాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జునైద్ అహ్మద్ మౌలానా తెలిపారు. లోక్ ఆదాలత్‌ను ఉద్దేశించి ఆయన గురువారం కోర్టులోని న్యాయసదన్‌లో అధికారులతో మాట్లాడారు. గత అదాలత్‌లో ఎక్కువ కేసులు రాజీ చేశారని, ఈ సారి జరగనున్న అదాలత్‌లో కూడా కేసుల రాజీపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా న్యాయసేవాధికారి సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు, ఎల్.అనురాధ దేవి ఎంవీ గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ సర్వీసుల సంఘం రాష్ట్ర కార్యదర్శిగా శ్రీనివాసరావు

శ్రీకాకుళం పాతబస్టాండ్: రాష్ట్ర రెవెన్యూ సర్వీసుల సంఘం రాష్ట్ర కార్యదర్శిగా జిల్లాకు చెందిన శ్రీకాకుళం తహసీల్దారు కార్యాలయం సూపరింటెండెంట్ పొదిలాపు శ్రీనివాసరావుని ఏపీ ఆర్ఎస్ఎస్ఏ ప్రతినిధులు నియమించారు. ఈ ఎంపికలు ఈనెల 4న విజయవాడలో జరిగాయి. పొదిలాపు శ్రీనివాసరావును ఏకగ్రీవంగా ఎంపిక చేశారు.

మరో పోరుకు శ్రీకారం



- థర్మల్ పవర్ ప్రాజెక్టుకు వ్యతిరేకంగా పురుడు పోసుకుంటున్న ఉద్యమం
- ప్రాజెక్టు విషయంలో ద్వంద్వ వైఖరి అవలంబిస్తున్న చంద్రబాబు ప్రభుత్వం
- ఎవరూ ఆపలేరని రెచ్చగొడుతున్న టీడీపీ ఎమ్మెల్యే కూన రవికుమార్
- సోంపేట, కాకరాపల్లి వేరు.. ఇక్కడ వేరు అని సమర్థన
- 20 గ్రామాలకు ప్రత్యక్ష ముప్పు



థర్మల్ క్రిటికల్ సూపర్ ఎలక్ట్రికల్ పవర్ ప్లాంట్ ఏర్పాటు చేసే ప్రతిపాదిత భూములు

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం :

ఉద్యమాల సిక్కోలు గడ్డపై మరో పోరాటం పురుడు పోసుకుంటోంది. థర్మల్ పవర్ ప్లాంట్‌కు వ్యతిరేకంగా ఒకప్పుడు సోంపేటలో జరిగిన పోరాటం జిల్లా చరిత్రలో ప్రత్యేకంగా నిలిచిపోయింది. బీల కోసం జరిగిన ఆ పోరాటం ఎంతో మందికి స్ఫూర్తిదాయకంగా నిలిచింది. సంతబొమ్మాళి మండలం కాకరాపల్లిలో తంపర భూముల్లో కూడా థర్మల్ పవర్ ప్రాజెక్టును తలపెట్టాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటే.. సోంపేట ఉద్యమమే స్ఫూర్తిగా తీసుకుని ఇక్కడి ప్రజలు కూడా పోరుబాట పట్టారు. ఇప్పుడు అదే తరహా ఉద్యమం కొత్తగా జీవం పోసుకుంటోంది.

థర్మల్ పవర్ ప్లాంట్‌లపై తొలి నుంచీ డబుల్ గేమ్ ఆడుతున్న టీడీపీ కొత్తగా ఆమదాలవలస నియోజకవర్గంలోని సరుబుజ్జిలి, బూర్జ మండలాల పరిధిలో ప్లాంట్ ఏర్పాటు చేయాలని నిర్ణయం తీసుకుంది. రూ. 30వేల కోట్లతో 3200 మెగావాట్ల థర్మల్ క్రిటికల్ సూపర్ ఎలక్ట్రికల్ పవర్ ప్లాంట్‌ను నిర్మించాలని చూస్తోంది. దీనికి సంబంధించి స్థానిక ఎమ్మెల్యే కూన రవికుమార్ ప్రకటనలు కూడా చేశారు. అభివృద్ధిని అడ్డుకుంటే అంతు చూస్తామని బెదిరింపులకు కూడా దిగుతున్నారు. సోంపేట, కాకరాపల్లి పరిస్థితులు వేరని, ఇక్కడి పరిస్థితులు వేరని కూన చెబుతున్నారు. కానీ ప్రజలు మాత్రం తమకు జరిగే నష్టంపైనే ఆలోచిస్తున్నారు. ఇప్పటికే చాలా మంది రోడ్డెక్కారు. కలెక్టరేట్ వద్ద నిరసన కూడా తెలిపారు. అయినప్పటికీ కూన రవికుమార్ వెనక్కి తగ్గమని స్టేట్‌మెంట్లు ఇస్తుండటంతో మరో ఉద్యమానికి సిద్ధమని జనం ముఖ్యంగా ఆదివాసీలు చెబుతున్నారు.

ప్రాజెక్టు నేపథ్యమిది..

బూర్జ, సరుబుజ్జిలి మండలాల పరిధిలో థర్మల్ క్రిటికల్ సూపర్ ఎలక్ట్రికల్ పవర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం అడుగులు వేస్తోంది. సరుబుజ్జిలి, బూర్జ మండలాల్లో గోపిదేవిపేట, మసానపుట్టి, బూర్జ మానుగూడ, జంగాలపాడు, బొడ్లపాడు, జేవీ పురం, అనంతగిరిపేట, వెన్నెలవలస 1- వెన్నెలవలస-2, తదితర గ్రామాల పరిధిలో ఈ ప్లాంట్‌ను రెండు విడతల్లో ఏర్పాటు చేయాలని భావిస్తోంది. 1600కు పైగా ఎకరాల్లో రూ. 30వేల కోట్ల వ్యయంతో 3200మెగా వాట్ల విద్యుత్ ఉత్పత్తి చేసేందుకు అంచనాలు రూపొందించారు. ఈ ప్రాజెక్టు ఏర్పాటైతే సుమారుగా 18మిలియన్ మెట్రిక్ టన్నుల బొగ్గు వినియోగం జరగనుండగా, సుమారు 12టీఎంసీల నీరు అవసరం ఉంటుంది. కోటి 40లక్షల లీటర్ల మేర హైస్పీడ్ డీజిల్ కావాల్సి ఉంటుందని ఆందోళనకారులు చెబుతున్నారు.

20 గ్రామాలకు ముప్పు..

ఇక్కడ ఏర్పాటు చేయబోయే పవర్ ప్రాజెక్టుతో 20 గ్రామాలకు ముప్పు ఉంటుందని, ఆదివాసీ గ్రామాలకు ప్రమాదం పొంచి ఉంటుందని, పోడు వ్యవసాయం చేసే ఆదివాసీలు భృతిని కోల్పోతారని, పక్కనున్న గ్రామాలకు కూడా నష్టమేనని ఆందోళన చెందుతున్నారు. అంతేకాకుండా వెన్నెలవలసలో ఉన్న విద్యాలయాలన్నీ తరలిపోక తప్పదనే భయాందోళనలో ఉన్నారు. పాతపట్నం, రాజాం, పాలకొండ, ఎచ్చెర్ల, శ్రీకాకుళం, నరసన్నపేట నియోజకవర్గ ప్రజలపై కూడా ప్రభావం చూపనుందని వాపోతున్నారు. ఇప్పటికే ప్రభావిత గ్రామ ప్రజలు సమావేశాలు పెట్టుకుని నిరసన తెలియజేస్తున్నారు.



మరో పోరాటానికి సిద్ధమంటూ సమాయత్త సదస్సుకు హాజరైన ఆదివాసీలు

ప్లాంట్ నిర్మాణం జరగనీయం



ప్రాణాలైనా అర్పిస్తాం గానీ పవర్ ప్లాంట్ నిర్మాణం చేపట్టనీయం. పవర్‌ప్లాంట్ వల్ల 20 కిలోమీటర్ల వరకు రేడియేషన్ సమస్య ఉంటుంది. గిరిజనులమంతా ఏకతాటిగా వ్యతిరేకిస్తాం.

– బాడంగి సురేష్ దొర, ఆదివాసీ సంక్షేమ పరిషత్ జిల్లా ఉపాధ్యక్షుడు

కలిసి పోరాడతాం



మేమంతా తరతరాలుగా పోడు వ్యవసాయం చేస్తున్నాం. మా బతుకులు నాశనం చేయొద్దు. మాకు ఏ ప్లాంట్ వద్దు. మా కొండ పోడు బాగు చేసుకుని బతుకుతాం. అంతా కలిసి పోరాడుతాం.

– సవర కుమారి, జంగాలపేట, బూర్జ మండలం

అనర్థమే అంటున్న స్థానికులు

ఈ ప్రాజెక్టు ఏర్పాటు చేస్తే తమ భూములను కోల్పోవడమే కాకుండా మానవ మనుగడే ప్రశ్నార్థకమవుతుందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దాదాపు 12టీఎంసీల నీటిని వంశధార రిజర్వాయర్ నుంచే తీసుకెళ్లాల్సి ఉంటుంది. లేదంటే నాగావళి రిజర్వాయర్ నుంచి తీసుకురావాల్సి ఉంటుంది. అదే జరిగితే లక్షలాది ఎకరాలకు సాగునీరు అందని పరిస్థితి ఉంటుందని, పవర్ ప్లాంట్ నుంచి 40శాతం మేర వ్యర్థాలు విడుదలవుతాయని, భూగర్భ జలాల్లోకి వెళ్లి మానవాళికి ముప్పుగా పరిణమిస్తుందని అంటున్నారు.

పోరాటాలకు సిద్ధం



సంతబొమ్మాళి మండలంలో ప్రజలంతా కలిసికట్టుగా తిరస్కరించిన థర్మల్ పవర్ ప్లాంట్‌ను కూటమి ప్రభుత్వం ఇక్కడి ప్రజలపై రుద్దుతోంది. ఇక్కడ ప్లాంట్ కడితే పర్యావరణంతోపాటు, విద్యాలయాలు, ప్రజల ఆరోగ్యం, పంటలు నాశనమయ్యే ప్రమాదముంది. మేమంతా పోరాటాలకు సిద్ధంగా ఉన్నాం.

– చింతాడ రవికుమార్, వైఎస్సార్ సీపీ ఆమదాలవలస నియోజకవర్గం ఇన్‌చార్జి

కూన రవికుమార్‌కే ఉపాధి



థర్మల్ పవర్ ప్రాజెక్టుతో యువతకు ఉద్యోగ ఉపాధి లభిస్తుందని ఎమ్మెల్యే కూన రవికుమార్ చెబుతున్నారు. కానీ ఆయనకు మాత్రమే ఉపాధి దొరుకుతుంది. ఈ ప్లాంట్ వల్ల ఆయా గ్రామాలే కాదు చుట్టు పక్కల నియోజకవర్గాలన్నింటికీ ముప్పే. దీనిపై చంద్రబాబు కూడా ఆలోచించాలి.

– సనపల సురేష్, బూర్జ

18 దుకాణాలకు.. 30 దరఖాస్తులేనా..?



- కల్లుగీత కులాల దుకాణాలు కొట్టేసేందుకు టీడీపీ కుట్రలు
- రంగంలోకి దిగిన సిండికేట్లు
- బినామీలతో మాయ చేసేందుకు పన్నాగం
- మిగతా వారు దరఖాస్తు చేసుకోకుండా బెదిరింపులు
- అందుకే తక్కువగా వచ్చిన దరఖాస్తులు

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం : కల్లు గీత కులాలకు కేటాయించిన మద్యం దుకాణాలపై టీడీపీ నాయకుల కన్నుపడింది. వాటిని ఎలాగైనా కొట్టేయడానికి వ్యూహాత్మకంగా వ్యవహరిస్తున్నారు. ఆ కులాల్లోని కొందరిని బినామీలుగా పెట్టి దరఖాస్తులు చేయిస్తున్నారు. అదే కులానికి చెందిన మిగతా వారిని దరఖాస్తు చేయనివ్వకుండా అడ్డుకుంటున్నారు. ఈ క్రమంలో నరసన్నపేటలో టీడీపీ, జనసేన మధ్య చిచ్చు రేగింది. మద్యం షాపులు కొందరు చేజిక్కించుకుని సిండికేట్‌లో కలుపుకోవడానికి యత్నిస్తున్నారని జనసేన నాయకులు మండిపడుతున్నారు.

దుకాణాల కేటాయింపులు

జిల్లాలో కల్లు గీత కులాలకు జిల్లాలో తొలి విడతగా 16దుకాణాలను కేటాయించారు. రెండో విడతగా సొండి కులం కోసం మరో రెండు దుకాణాలను మంజూరు చేశారు. మొత్తం 18 దుకాణాలకు దరఖాస్తు చేసుకోవడానికి నోటిఫికేషన్ ఇచ్చారు. ఇందులో మొదటి విడతగా ప్రకటించిన 16 దుకాణాలకు ఈనెల 5వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని నోటిఫికేషన్‌లో పేర్కొన్నప్పటికీ తర్వాత కొన్ని కారణాలతో 8వ తేదీ వరకు దరఖాస్తు చేసుకునేందుకు పొడిగించారు. రెండో విడతలో కేటాయించిన రెండు దుకాణాలకు ఈనెల 7వ తేదీలోగా దరఖాస్తులు స్వీకరించనున్నారు. రెండో విడతలో ప్రకటించిన రెండు దుకాణాలకు గాను కలెక్టరేట్‌లో ఈనెల 8న డ్రా తీయనుండగా, మొదటి విడతలో కేటాయించిన 16దుకాణాలకు 10న అంబేడ్కర్ ఆడిటోరియంలో డ్రా తీయనున్నారు.

18 దుకాణాలకు గాను 30 దరఖాస్తులు

జిల్లాలో రెండు విడతలుగా కేటాయించిన 18 దుకాణాలకు గాను 30 దరఖాస్తులు మాత్రమే ఇప్పటివరకు వచ్చాయి. ఆరు దుకాణాలకు సింగిల్ దరఖాస్తులు పడగా, 12 దుకాణాలకు రెండేసి చొప్పున దరఖాస్తులు వచ్చాయి. 16 దుకాణాలకు గాను ఈనెల 8వరకు, రెండు దుకాణాలకు నేటి వరకు దరఖాస్తుల స్వీకరణ గడువు ఉన్న కారణంగా చివరి రోజుల్లో ఎన్ని పడతాయో చూడాల్సి ఉంది. అయితే, కులాల వారీగా కేటాయించిన దుకాణాలను టీడీపీకి చెందిన కొందరు హైజాక్ చేస్తున్నారు. తమకు సన్నిహితంగా ఉండే కులాల వారిని బినామీలుగా పెట్టి ఒకరిద్దరి చేత చేయిస్తున్నారు. వారికి పోటీగా అదే కులానికి చెందిన వారి నుంచి దరఖాస్తులు వేయకుండా అడ్డుకుంటున్నారు. ఈ కారణం చేతనే ఇప్పటివరకు ఆశించిన మేర దరఖాస్తులు పడలేదు. వాస్తవంగా కల్లు గీత కులాల వారికి కేటాయించిన దుకాణాలకు దరఖాస్తు చేసేందుకు దరఖాస్తు ఫీజు రూ. 2లక్షలు అయినప్పటికీ లైసెన్సు ఫీజు మాత్రం సగమే ఉండటంతో వ్యాపారం లాభదాయకంగా ఉంటుందని టీడీపీ నాయకులు గురి పెట్టారు. వాటిని వ్యూహాత్మకంగా దక్కించుకుని బినామీలను రంగంలోకి దించారు. జరుగుతున్న పరిణామాలను తెలుసుకుని కల్లు గీత కులాల వారు మండిపడుతున్నారు. దరఖాస్తుల స్వీకరణ ఆఖరి తేదీ రోజైనా వేయాలని కొందరు ఆసక్తి చూపిస్తున్నారు. కానీ, వారిపై సిండికేట్ల బెదిరింపులు ఎక్కువగా ఉన్నాయి.

ఖండించిన జనసేన నాయకుడు

కల్లుగీత వారి దుకాణాలు సిండికేట్‌లో కలుపుకోవడానికి జరుగుతున్న ప్రయత్నాలను జనసేన తీవ్రంగా ఖండిస్తుందని నరసన్నపేట నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి బలగ ప్రవీణ్ కుమార్ వెల్లడించారు. శ్రీశయన ఉప కులాలకు కేటయించిన దుకాణాలను కొందరు చేజిక్కించుకోవడానికి చేస్తున్న యత్నాలు సరికాదన్నారు.

థర్మల్ పవర్ ప్లాంట్ వద్దే వద్దు




సమావేశంలో మాట్లాడుతున్న మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం

- మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం

ఆమదాలవలస: సరుబుజ్జిలి, బూర్జ మండలాల పరిసర గ్రామాల పరిధిలో క్రిటికల్ థర్మల్ పవర్ ప్రాజెక్టు నిర్మాణం వినాశనానికి దారి తీస్తుందని, దీని వల్ల ఆయా మండలాల పరిధిలో 23 గిరిజన గ్రామాలు ప్రజలు నిరాశ్రయులవుతారని మాజీ స్పీకర్, వైఎస్సార్‌సీపీ జిల్లా పార్లమెంటరీ నియోజకవర్గ పరిశీలకుడు తమ్మినేని సీతారాం అన్నారు. ఆయన గురువారం తన నివాసంలో విలేకరులతో మాట్లాడారు. ప్రజాభిప్రాయానికి విరుద్ధంగా ప్లాంట్ నిర్మాణం చేపడితే ఆదివాసీల బతుకులు బుగ్గిపాలవుతాయని అన్నారు. గతంలో సోంపేట, కాకరాపల్లిలో ఏం జరిగిందో పాలకులకు గుర్తు లేదా అని ప్రశ్నించారు. వంశధారలో నీరు మొదటి పంటకే సరిపోవడం లేదని, ప్లాంట్‌కు నీటిని మళ్లిస్తే పొలాలకు ఎలా నీరందుతుందని అన్నారు. రిజర్వాయర్‌లోని నీటిని ప్లాంటుకు తరలిస్తే వేలాది ఎకరాల పంట భూములు బీడుగా మారుతాయన్నారు. శ్రీకాకుళానికి థర్మల్ వ్యతిరేక ఉద్యమాలు చేపట్టిన చరిత్ర ఉందని గుర్తు చేశారు. ప్రజాభిప్రాయాన్ని కాదని ప్లాంట్ నిర్మాణానికి ఉపక్రమిస్తే ప్రజా పక్షాన వైఎస్సార్ సీపీ నాయకులమంతా ఉద్యమిస్తామని అన్నారు. శుక్రవారం సరుబుజ్జిలి, బూర్జ మండలాల్లో గిరిజన మేధావుల కమిటీ పర్యటిస్తుందని, వారికి కూడా వినతి పత్రాన్ని అందించనున్నామని తెలిపారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన విభాగ ప్రధాన కార్యదర్శి తమ్మినేని చిరంజీవినాగ్, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి కేవీజీ సత్యనారాయణ, బూర్జ, సరుబుజ్జిలి జెడ్పీటీసీలు రామారావు, సురవరపు నాగేశ్వరరావు, డీసీసీబీ మాజీ డైరెక్టర్ బొడ్డేపల్లి నారాయణరావు, జిల్లా ఉపాధ్యక్షులు కింజరాపు సురేష్, పార్టీ ముఖ్యనాయకులు పేడాడ చిరంజీవి, సురేష్, రవి, సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

శాలిహుండం.. సర్వ సన్నద్ధం



సంతాన వేణుగోపాలుడు..

- నేటి నుంచి కాళీయ మర్ధన సంతాన వేణుగోపాలుని యాత్ర
- 8న వంశధార నదిలో చక్రతీర్థ స్నానం
- 12న తిరుక్కల్యాణ మహోత్సవం

భీష్మ ఏకాదశి రోజున జరిగే స్వామి చక్రతీర్థ స్నానంలో పాల్గొని, కొండపై వ్రతమాచరించి ఉపవాసం చేసి స్వామిని దర్శించుకుంటే సంతానం కలుగుతుందని భక్తుల విశ్వాసం. అలాగే దాసురాళ్లు, దాసుళ్లు తరలివచ్చి స్వామికి పూజలు చేసి విభూతి ఉండలను కొనుగోలు చేసి ఇంటికి తీసుకెళ్లి పూజలు చేస్తారు. శాలిహుండం యాత్ర తర్వాతే ఇంటి దగ్గర సంబరాలు చేసుకోవడం చాలా మందికి పరిపాటి.



కొండపై పూజలందుకుంటున్న కాళీయ మర్ధన 'సంతాన' వేణుగోపాలుడు

గార: శాలిహుండంలోని శ్వేతగిరిపై వేంచేసిన కాళీయ మర్ధన వేణుగోపాలస్వామి యాత్ర శుక్రవారం ప్రారంభం కానుంది. ఏటా భీష్మ ఏకాదశి నాడు నిర్వహించే ఈ యాత్రకు ఎంతో ప్రాముఖ్యత ఉంది. ముందు రోజు సాయంత్రం నుంచి దూర ప్రాంత భక్తులు ఇక్కడకు విచ్చేసి రాత్రి బస చేస్తారు. శుక్రవారం సాయంత్రం పరిసర గ్రామాల్లో స్వామి తిరువీధి ఉత్సవం నిర్వహిస్తారు. శనివారం ఉదయం వంశధార నదిలో వేణుగోపాలస్వామి, లక్ష్మీనృసింహ స్వామి వార్లను రెండు పల్లకీల్లో తీసుకొని వెళ్లి సంప్రదాయబద్ధంగా చక్రతీర్థ స్నానాలు చేయిస్తారు. 12వ తేదీన తిరుక్కల్యాణం నిర్వహిస్తారు.

విస్తృతంగా ఏర్పాట్లు చేస్తున్నాం..



ఏటా స్వామిని దర్శించుకునే భక్తుల సంఖ్య పెరుగుతూనే ఉంది. దీంతో ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నాం. కొండ పైకి దివ్యాంగులు వెళ్లేందుకు కింది నుంచి వాహనాలను ఏర్పాటు చేస్తున్నాం.

– సుగ్గు మధురెడ్డి, ఆలయ వంశపారంపర్య ధర్మకర్త

ప్రత్యేక ఏర్పాట్లు

స్వామినిభక్తులు సులువుగా దర్శించుకొనేందుకు వీలుగా బ్యారికేడ్లు, క్యూలైన్లు ఏర్పాటు చేశారు. వేల సంఖ్యలో లడ్డూలను తయారుచేస్తున్నారు. క్యూలో ఉన్న భక్తులకు తాగునీరు సదుపాయాన్ని ఏర్పాటు చేశామని కమిటీ సభ్యులు తెలిపారు. ఆర్టీసీ ద్వారా ప్రత్యేక బస్సులు నడుపుతున్నామని అధికారులు తెలిపారు.



క్యూలు పరిశీలిస్తున్న డీఎస్పీ సీహెచ్ వివేకానంద

సంబరానికి కమ్మసిగడాం సిద్ధం

- నేటి నుంచి శ్రీమహాలక్ష్మి తల్లి జాతర
- పకడ్బందీగా ఏర్పాట్లు చేసిన ఆలయ కమిటీ సభ్యులు



మహాలక్ష్మి తల్లి ఆలయ స్వాగత ద్వారం

రణస్థలం: మండలంలోని కమ్మసిగడాం పంచాయతీలో వెలసిన శ్రీ మహాలక్ష్మి తల్లి జాతర శుక్రవారం నుంచి మొదలుకానుంది. ఏటా రథసప్తమి పురస్కరించుకొని పెళ్లి రాటతో మొదలై, తొలి రోజు శుక్రవారం అమ్మవారి కల్యాణం రాత్రి 9.20 గంటలకు జరిగిన తర్వాత మిగతా సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయి. ఇప్పటికీ తొలిరోజు ఎడ్లబండిపై జాతరకు రావడం ఇక్కడి ప్రత్యేకత.

స్థల పురాణమిదే..

స్థానికంగా ప్రచారంలో ఉన్న కథ ప్రకారం.. 1750 సంవత్సరంలో విజయనగరం రాజులు పాలిస్తున్న కాలంలో వారి సైన్యాలకు బొట్ల గురప్ప దొర, వెలిచేటి చినకూర్మరాయులు అధిపతులుగా ఉండేవారు. ఈ ప్రాంతంలో చాలామంది జమీందారులు సామంత రాజులుగా ఉండేవారు. కానీ శ్రీకాకుళాన్ని పాలిస్తున్న బాదుర్లాఖాన్, అబ్దుల్లాఖాన్ అనే మహమ్మదీయులు కప్పం చెల్లించడం లేదని విజయరామరాజు తమ సైన్యాధిపతులైన బొట్ల గురప్పదొర, వెలిచేటి చినకూర్మరాయులును రాయబారులుగా పంపించారు. కానీ వారు కప్పం చెల్లించకపోగా.. యుద్ధానికి కాలు దువ్వారు. ఈ యుద్ధంలో విజయనగరం సైన్యం ఓడిపోయింది. అవమాన భారంతో బొట్ల గురప్పదొర తన సొంత గ్రామం సంచాం వెళ్లకుండా మళ్లీ యుద్ధం చేసి గెలవాలని రణస్థలం మండలంలోని దేవరపల్లి వద్ద సైన్యానికి ఆరు నెలలు శిక్షణ ఇచ్చి మళ్లీ యుద్ధం ప్రకటించి గెలిచారు. ఓటమి బాధతో మహమ్మదీయులు మాటు వేసి గురప్ప దొరను హతమార్చారు. భర్త మరణవార్త విని ఇద్దరు భార్యల్లో ఒకరైన మహాలక్ష్మి సతీసహగమనం చేశారు. ఆమె ఆహుతయ్యాక చితిలో చీరచెంగు, పసుపు, కుంకుమ భరిణిలు కాలిపోకుండా కనిపించాయి. దీంతో ఆమెను దైవ స్వరూపిణిగా భావించి అక్కడే ఆలయాన్ని కట్టారు. అప్పటి నుంచి ఏటా జాతర చేస్తున్నారు. చీపురుపల్లి మండలంలోని పెదనడిపిల్లి గ్రామానికి చెందిన కన్నవారు చీర, శతమానం, అత్తవారి గ్రామమైన సంచాం నుంచి మేళం, బంటుపల్లి కుటుంబీకులు పల్లకి మీద వచ్చి సంప్రదాయబద్ధంగా కల్యాణం జరిపిస్తారు. ఈ మహోత్సవాన్ని తిలకించడానికి చుట్టుపక్కల ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు వస్తుంటారు. ఈ ఏడాది 300 మందితో బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. విద్యుత్ దీప కాంతులు, పలు సినీ, పౌరాణిక కళాకారుల కార్యక్రమాలు కూడా ఉన్నాయి.



మహాలక్ష్మి తల్లి ప్రతిమలు

క్లుప్తంగా

కిడ్నీ విషాదాలు పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు, రచయిత బద్రి కూర్మారావు

కాశీబుగ్గ: ఉద్దాన ప్రాంతంలో కిడ్నీవ్యాధి మూలాలు, అక్కడి పరిస్థితులకు అక్షర రూపమిస్తూ రచించిన 'కిడ్నీ విషాదాలు' పుస్తకాన్ని మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పరాజు పలాసలో గురువారం ఆవిష్కరించారు. రంగోయి గ్రామానికి చెందిన విశ్రాంత అధ్యాపకులు బద్రి కూర్మారావు ఈ పుస్తకాన్ని రచించారు. కార్యక్రమంలో కో-ఆప్షన్ సభ్యులు బమ్మిడి సంతోష్‌కుమార్, నాయకులు శిష్టు గోపి, జినగ సీతారామయ్య తదితరులు పాల్గొన్నారు.

రైలు పట్టాలపై గుర్తు తెలియని మృతదేహం



వ్యక్తి మృతదేహం

పొందూరు: పొందూరు రైల్వే స్టేషన్ సమీపంలో ట్రాక్‌పై గుర్తు తెలియని మృతదేహాన్ని గుర్తించినట్లు జీఆర్‌పీ శ్రీకాకుళం రైల్వే ఎస్ఐ మధుసూదనరావు గురువారం తెలిపారు. పసుపు రంగు ఫుల్‌హ్యాండ్ షర్టు, ఆకుపచ్చ షార్టు ధరించి ఉన్నాడని చెప్పారు. వివరాలు తెలిసిన వారు 9493474582 నంబరుకు సంప్రదించాలని కోరారు.

వెబ్‌సైట్ రూపకర్తకు ఎస్పీ అభినందనలు



నవీన్‌ను అభినందిస్తున్న ఎస్పీ, ఏఎస్పీలు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): శ్రీకాకుళం జిల్లా పోలీసుల నూతన వెబ్‌సైట్ 'శ్రీకాకుళంపోలీస్.ఎపి.జివొవి.ఇన్' రూపకల్పన చేసిన కంచిలి మండలం కేసరపడ గ్రామానికి చెందిన కొరికాన నవీన్‌ని ఎస్పీ కె.మహేశ్వరరెడ్డి గురువారం అభినందించారు. ఈ మేరకు జిల్లా పోలీసు కార్యాలయంలో నగదు, ప్రశంసా పత్రం అందించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతానికి చెందిన నవీన్ విద్యార్థి దశలోనే ప్రతిభ కనబరిచి ఒక్క క్లిక్‌తో జిల్లా పోలీస్ శాఖ పూర్తి వివరాలు తెలుసుకునేలా వెబ్‌సైట్ రూపకల్పన చేయడం గొప్ప విషయమన్నారు. భవిష్యత్తులో మరింతగా రాణించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ కె.వి.రమణ, సైబర్ సెల్ సీఐ శ్రీనివాస్, ఏఎస్ఐ రమేష్ పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలకు పకడ్బందీగా ఏర్పాట్లు



మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లాలో ఇంటర్మీడియెట్ పరీక్షల నిర్వహణకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశించారు. ఇంటర్ పరీక్షల ఏర్పాట్లపై గురువారం తన చాంబర్‌లో అధికారులతో సమావేశం నిర్వహించారు. 10వ తేదీ నుంచి ప్రాక్టికల్స్ ప్రారంభం కానున్నాయని ఆర్ఐఓ పి. దుర్గారావు తెలిపారు. ప్రయోగ పరీక్షలు ఉదయం 9 నుంచి 12 గంటల వరకు, మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల వరకు జరుగుతాయని చెప్పారు. ఒకేషనల్ కోర్సు పరీక్షలు 5 నుంచి ప్రారంభమవుతాయన్నారు. థియరీ పరీక్షలు మార్చి 1 నుంచి 20వరకూ జరుగుతాయన్నారు. మొత్తం 40356 మంది (ఫస్టియర్ 20,389, సెకండియర్ 19,967 మంది) విద్యార్థులు హాజరు కానున్నారని తెలిపారు. వీరిలో 37,976 మంది సాధారణ, 2380 మంది ఒకేషనల్ విద్యార్థులు ఉన్నారని వివరించారు. 75 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కలెక్టర్ మాట్లాడుతూ.. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేయాలని, పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేయాలని, సమీపంలోని జిరాక్స్ కేంద్రాలను మూసి వేయాలని తెలిపారు. అన్ని కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఎలాంటి సాంకేతిక లోపం లేకుండా చూసుకోవాలని స్పష్టం చేశారు. నిర్దేశించిన సమయానికి విద్యార్థులు కచ్చితంగా హాజరు కావాలన్నారు.

నవ్యాంధ్ర అభివృద్ధికి 'పీ-4' మోడల్

శ్రీకాకుళం పాతబస్టాండ్: నవ్యాంధ్రప్రదేశ్ అభివృద్ధికి పబ్లిక్, ప్రైవేట్, పీపుల్ పార్టనర్‌షిప్ (పి-4) కీలకమైన సాధనమని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ పేర్కొన్నారు. సచివాలయం నుంచి గురువారం కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ మాట్లాడుతూ జిల్లాలో పి-4 ప్రణాళిక అమలుకు తీసుకుంటున్న చర్యలను వివరించారు. సమావేశంలో సీపీవో ప్రసన్నలక్ష్మి, డీపీఓ భారతి సౌజన్య, జెడ్పీ సీఈవో శ్రీధర్ రాజా, డీఆర్డీఏ పీడీ కిరణ్‌కుమార్, పరిశ్రమల శాఖ జీఎం ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

ధరల భూతం



- భూముల ధరలు 10 నుంచి 70శాతం వరకు పెంపు
- గత 20 ఏళ్లలో ఈ స్థాయి పెంపు ఇదే తొలిసారి
- ఆదాయం పెంచుకోవడమే లక్ష్యంగా ప్రభుత్వం అడుగులే
- ప్రజల నెత్తిన కొత్త భారం

శ్రీకాకుళం (పీఎస్ కాలనీ):

'భూ' బాంబు గట్టిగా పేలింది. కేవలం ఆదాయం మాత్రమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తుండడంతో పేదోడి నెత్తిన కొత్త భారం పడుతోంది. ఇప్పటికే మార్కెట్‌లో నిత్యావసర సరుకుల ధరలు మంటెక్కిస్తున్నాయి. విద్యుత్ చార్జీలు షాక్ కొట్టిస్తున్నాయి. స్కూల్ ఫీజులు, పుస్తకాల కొనుగోలు భారమైపోయింది. దీంతో సామాన్య, మధ్య తరగతి ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. కష్టపడి పనిచేసి పైసా పైసా కూడబెట్టుకుని ఒకటో, రెండు సెంట్లు భూమి కొనుగోలు చేసి ఓ చిన్న గూడు నిర్మించుకుందామంటే ఆ ధరలు అమాంతంగా పెంచేస్తున్నారు. అతి తక్కువగా 10శాతం నుంచి అత్యధికంగా 70శాతం వరకు ప్రభుత్వమే నేరుగా పెంచేసింది. దీంతో పేదోడికి సొంతింటి కల అందని ద్రాక్షగానే మిగిలిపోయే ప్రమాదం దాపురించింది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్న ఐదేళ్లలో రెండుసార్లు కేవలం 10శాతం మాత్రమే పెంచారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకొచ్చిన ఆరు మాసాలకే భారీగా పెంచేయడం చాలా దారుణమని రియల్‌వర్గాలు చెబుతున్నాయి.

వాస్తవానికి జనవరి 1 నుంచి కొత్త ధరలు వస్తాయని చెప్పి మరికొంత కసరత్తు చేసి భారీగా ధరలు పెంచేలా ప్రణాళిక రచించారు. ప్రస్తుతం ఉన్న ధరలకు భూములు, ఇళ్ల స్థలాల కొనుగోలు అమ్మకాలు చేసేందుకు ఇబ్బంది పడుతున్నారు. ఈ కొత్త ధరల 'భూ' బాంబుతో మరిన్ని ఇబ్బందులు తప్పవు. ఇప్పటికే పేద, మధ్య తరగతి కుటుంబాల వద్ద నగదు వ్యవహారాలు తగ్గిపోయాయి. ఈ ధరలతో వ్యాపారం అవ్వదనే రియల్ వ్యాపారులు చెబుతున్నారు. భూములు, కొనుగోలు అమ్మకాలు భారీగా తగ్గిపోయాయి.

ధరల వివరాలిలా..

2025 జనవరి 31వరకు ఉండే గజం భూమి ధరలు, ప్రస్తుతం పెరిగిన ఫిబ్రవరి 1నుంచి ధరలు ఇలా ఉంటాయి.

ఎస్ఆర్ఓ పరిధి	ప్లాట్లు పాత-కొత్త ధర	వ్యవసాయ భూమి పాత-కొత్త ధర (ఎకరం)
శ్రీకాకుళం	రూ.13000-20000	రూ.49లక్షలు-1.17కోట్లు
ఆమదాలవలస	రూ.12000-15000	రూ.17.50లక్షలు-20లక్షలు
నరసన్నపేట	రూ.13000-15000	రూ.30లక్షలు-35లక్షలు
టెక్కలి	రూ.7500-9000	రూ.14లక్షలు-17లక్షలు
కాశీబుగ్గ	రూ.25000-28000	రూ.17.50లక్షలు-20లక్షలు
హిరమండలం	రూ.5000-6500	రూ.4.40లక్షల-7లక్షలు
పాతపట్నం	రూ.7000-10000	రూ.10లక్షలు-14లక్షలు
కోటబొమ్మాళి	రూ.6600-7000	రూ.15లక్షలు-19లక్షలు
ఇచ్ఛాపురం	రూ.7300-8500	రూ.12లక్షలు-14లక్షలు
మందస	రూ.3800-5000	రూ.8లక్షలు-10లక్షలు
సోంపేట	రూ.11300-12500	రూ.10లక్షలు-11లక్షలు
పొందూరు	రూ.6000-7000	రూ.10లక్షలు-15లక్షలు
రణస్థలం	రూ.5000-10000	రూ.17లక్షలు-24లక్షలు

ప్రభుత్వ నిబంధనల మేరకే పెంపు



ప్రభుత్వ నిబంధనల మేరకే ధరలు పెంచాం. పెరిగిన ధరలకు అనుగుణంగా రిజిస్ట్రేషన్ చార్జీలుంటాయి. స్టాంప్ డ్యూటీ 6.5శాతం, రిజిస్ట్రేషన్ ఫీజు 1శాతం ఉంటుంది. భూములు కొనుగోలు, అమ్మకందారులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. ఫిబ్రవరి 1 నుంచి ధరలు పెరిగాయి. ప్రాంతాల్ని బట్టి ధరలు పెంపు చేశాం.

– ఎ.నాగలక్ష్మి, ఇన్‌చార్జి జిల్లా రిజిస్ట్రార్, డీఐజీ శ్రీకాకుళం

పెంపు ఇలా..

ఉదాహరణకు శ్రీకాకుళం నగరంలో 80 అడుగల రోడ్డులో ఒక చదరపు గజం ధర పాతది రూ. 9వేలు ఉంటే పెరగనున్న ధర రూ. 25వేలకి చేరనుంది. సెంటు ధర రూ.12.10లక్షలకు పెరగనుంది. ప్రభుత్వం ధరే ఇంత ఉంటే బహిరంగ మార్కెట్ ఇంకెంత ధర పలుకుతుందో. వ్యవసాయ భూమి చూసుకుంటే బలగ ప్రాంతంలో పాత ధర రూ. 49లక్షలు ఉంటే పెరిగిన ధర రూ. 1.17కోట్లుకి చేరింది. ఇలా జిల్లా వ్యాప్తంగా అత్యధికంగా శ్రీకాకుళం 80 అడుగుల రోడ్డు, కిమ్స్‌రోడ్డు, ఆర్టీసి కాంప్లెక్స్, డే అండ్ నైట్ కూడలి వద్ద భారీగా పెరిగాయి.

రివిజన్ కమిటీకి 23 ఫిర్యాదులు..

నెల రోజుల పాటు రివిజన్ కమిటీ అభ్యంతరాలు స్వీకరిస్తే కేవలం 23 మాత్రమే వచ్చినట్లు చెబుతున్నారు. ఇందులో 20 ఫిర్యాదులకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఈ కమిటీలో చైర్మన్‌గా జాయింట్ కలెక్టర్, మెంబర్లుగా జిల్లా పరిషత్ సీఈవో, సుడా వైస్‌చైర్మన్, కన్వీనర్లుగా సబ్‌రిజిస్ట్రార్లు ఉన్నారు.

నటనలో మేటి.. పౌరాణికంలో ఘనాపాటి





కందుకూరి అవార్డు అందుకుంటున్న సత్యవతి

ప్రతిభ

- మూడున్నర దశాబ్దాలుగా కళామతల్లి సేవలో సత్యవతి
- నాలుగు వేలకుపైగా ప్రదర్శనలు

శ్రీకాకుళం కల్చరల్: మూడున్నర దశాబ్దాలుగా నాటకరంగంలో విశేష సేవలందిస్తున్నారు కరజాడకు చెందిన పైడి సత్యవతి. ప్రస్తుతం చిన్న బరాటం వీధిలో నివాసముంటున్న ఈమె కళాకారుల సమాఖ్యలో కీలక పదవిలో ఉంటూ ఇప్పటికీ పౌరాణిక ప్రదర్శనలు చేస్తూ కళాభిమానులను ఆకట్టుకుంటున్నారు. 1990లో బొబ్బిలి యుద్ధం బుర్రకథతో ప్రారంభమైన తన కళా ప్రస్థానంలో నేటికీ నిరాటంకంగా కొనసాగుతోంది. 13 ఏళ్ల వయసులోనే నాటకరంగ ప్రవేశం చేశారు. సోదరుడు వెంకటరావు ప్రోత్సాహంతో సాంఘిక, జానపద నాటకాలలో హీరోయిన్‌గా ప్రదర్శనలు ఇస్తున్న సమయంలో 1994 నుంచి శ్రీసరస్వతీ నాటక కళాసమితి నిర్వాహకులు రామచంద్ర దేవ్ మాస్టార్ ద్వారా పౌరాణిక నాటకాలలో రంగ ప్రవేశం చేశారు. తొలిసారిగా లవకుశ నాటకంలో సీత పాత్ర పోషించారు. ఇదే నాటకాన్ని 500 సార్లు ప్రదర్శించి సీత పాత్రకు కేరాఫ్ అడ్రస్‌గా నిలిచారు. సారంగధరలో చిత్రాంగి గానూ చక్కని ప్రదర్శన కనబరిచారు. ఒకానొక సమయంలో నెలలో 25 వరకు ప్రదర్శనలు చేసి బిజీ ఆర్టిస్టుగా పేరుతెచ్చుకున్నారు.

పేరుతెచ్చిన పాత్రలెన్నో..

బాలనాగమ్మలో సంగు, హరిశ్చంద్రలో చంద్రమతి, తారాచంద్రుడులో తార పాత్రలు మంచి పేరు తీసుకొచ్చాయి. ఇవి కాక కళింగ వైభవం, చింతామణి, విధివ్రత, కన్నీటికాపురం, కన్నీటి కడలి, రథచక్రాలు వంటి నాటకాలతో అభిమానులను అలరించారు.

సత్కారాలు, పురస్కారాలు..

సర్పిపట్నంలో జరిగిన పరిషత్ నాటిక పోటీల్లో 'ఉత్తమ నటి' అవార్డు అందుకున్నారు. 2016లో రాష్ట్ర ప్రభుత్వం ద్వారా 'కందుకూరి' పురస్కారాన్ని కూడా అందుకున్నారు. అనేక సత్కారాలు లభించాయి.

ఈ దేశాన్ని యువతే రక్షించాలి



ఏఐవైఎఫ్ రాష్ట్ర మహాసభల్లో మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): పెట్టుబడిదారులు, కార్పొరేట్ శక్తుల నుంచి ఈ దేశాన్ని యువతే రక్షించాలని వక్తలు అన్నారు. శ్రీకాకుళం అంబేడ్కర్ ఆడిటోరియంలో ఏఐవైఎఫ్ 22వ రాష్ట్ర మహా సభలు గురువారం ప్రారంభమయ్యాయి. ఈ బహిరంగ సభకు ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు పరుచూరి రాజేంద్ర బాబు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా శ్రీకాకుళం పురవీధుల్లో ఊరేగింపు చేసి బహిరంగ సభ నిర్వహించారు. ఏఐవైఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శి తిరుమలై రామన్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం మతం పేరుతో దేశ ప్రజల ఐక్యతను దెబ్బ తీస్తోందని విమర్శించారు. కార్పొరేట్ శక్తులకు ఊడిగం చేస్తూ పెట్టుబడిదారుల చేతుల్లో దేశాన్ని పెడుతోందన్నారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ మాట్లాడుతూ అల్లూరి పోరాట స్ఫూర్తితో యువత ఈ దేశంలో పెద్ద ఎత్తున పోరాటాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. మోదీ వచ్చాక ఏ సమస్య పరిష్కారం కాలేదన్నారు. డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ సనాతన ధర్మం అని చెప్పిన ఈయన క్రిస్టియన్‌ను ఎలా వివాహం చేసుకున్నాడన్నారు. ఏఐవైఎఫ్ మాజీ జాతీయ కార్యదర్శి జి.ఈశ్వరయ్య మాట్లాడుతూ ఈ ప్రభుత్వాలు డబుల్ ఇంజన్ సర్కార్లు కాదని, బుల్డోజర్ సర్కార్లని దుయ్యబట్టారు. 40 ఏళ్లుగా నాగావళి, వంశధార సాగునీటి ప్రాజెక్టు పూర్తి చేయకుండా, ఒడిశాతో ఉన్న నీటి సమస్యను పరిష్కరించకుండా, నీటిని సముద్రం పాలు చేస్తున్నాయన్నారు. సీఎం చంద్రబాబుకు చిత్త శుద్ధి ఉంటే కేంద్రం, ఒడిశాలో ఉన్నవి బీజేపీ ప్రభుత్వాలే కాబట్టి సమస్య పరిష్కరించాలన్నారు. చంద్రబాబుకు నైతిక విలువలు లేవని, ఢిల్లీ ఎన్నికల్లో కేజ్రీవాల్ ఓటమి కోసం బీజేపీ తరఫున ప్రచారం చేయడానికి వెళ్లారన్నారు. ఎన్నికల హామీల పేరుతో మోసం చేశారని విమర్శించారు. ఒడిశా ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ప్రదీప్ మాట్లాడుతూ బీజేపీ పాలనలో ఆదివాసులకు రక్షణ లేకుండా పోయిందని అన్నారు. ఆహ్వాన సంఘం అధ్యక్షులు చాపర సుందర లాల్ మాట్లాడుతూ శ్రీకాకుళం జిల్లాలో రాష్ట్ర మహాసభలు నిర్వహించడం చాలా స్ఫూర్తి కలిగించాలని దాతల సహాయంతో ఈ మహాసభలు దిగ్విజయంగా నిర్వహిస్తామన్నారు. సభలో సినీ సంగీత దర్శకులు వందేమాతరం శ్రీనివాస్, సీపీఐ రాష్ట్ర సహాయకార్యదర్శి జేవీ సత్యనారాయణ మూర్తి, ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు పరుచూరి రాజేంద్రబాబు, నక్కి లెనిన్‌బాబు, ఆహ్వాన సంఘం అధ్యక్షులు చాపర సుందర్ లాల్, సీపీఐ జిల్లా కార్యదర్శి చాపర వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

అతివేగానికి ఇద్దరు యువకులు బలి

- అర్ధరాత్రి డివైడర్‌ను ఢీకొట్టిన బైక్
- ఘటనా స్థలంలోనే మృత్యువాత



కార్తీక్ (ఫైల్)



తరుణ్ (ఫైల్)

ఎచ్చెర్ల క్యాంపస్ : అతివేగానికి ఇద్దరు యువకులు బలయ్యారు. జాతీయ రహదారిపై బైక్‌పై వెళ్తూ అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టడంతో ఘటనా స్థలంలోనే మృతి చెందారు. ఇరు కుటుంబాల్లోనూ తీరని విషాదం మిగిల్చారు. బుధవారం అర్ధరాత్రి అల్లినగరం సమీపంలో జాతీయ రహదారిపై ఈ ఘటన చోటుచేసుకుంది. ప్రమాదం జరిగిన సమయంలో 100 మీటర్ల వరకు బైక్ ఎగిరిపడింది. వాహనచోదకులు గుర్తించి అత్యవసర సర్వీసులకు ఫోన్ చేయడంతో అంబులెన్స్, పోలీసులు చేరుకున్నారు. మృతులిద్దరూ శ్రీకాకుళం పట్టణంలోని ఫాజుల్‌బేగ్‌పేటకు చెందిన దీర్ఘాసి కార్తీక్ (21), గుజరాతిపేట సమీపంలోని చౌదరి సత్యనారాయణ కాలనీకి చెందిన పండా తరుణ్ (19)గా గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. వీరు విశాఖపట్నం వైపు నుంచి వస్తున్నారు. అర్ధరాత్రి ఎందుకు వస్తున్నారనే విషయం తెలియలేదు. వీరిద్దరూ స్నేహితులు. స్పోర్ట్స్ బైక్ అతి వేగంగా నడపటం, హెల్మెట్ సైతం పెట్టకపోవటం, బలంగా డివైడర్‌ను ఢీకొట్టడం వల్ల యువకులు మృతి చెంది ఉంటారని పోలీసులు భావిస్తున్నారు. ప్రమాద సమయంలో కార్తీక్ బైక్ నడుపుతున్నట్లు సమాచారం. ఇద్దరు యువకులు పేద కుటుంబానికి చెందిన వారు. కార్తీక్ టైర్ బండితో ఇసుక తరలిస్తూ జీవనం సాగిస్తుండగా, తరుణ్ ప్రైవేట్ దుకాణంలో పనిచేస్తున్నాడు. మృతదేహాలను శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వి.సందీప్‌కుమార్ చెప్పారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లాలో 2024-25 సంవత్సరానికి గాను 45,657 మంది విద్యార్థులకు రూ.35,58,63,479 ఫీజు రీయిబర్స్‌మెంట్ నిధులు విడుదలైనట్లు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ కళాశాలలో డిగ్రీ, పీజీ, ఇంజినీరింగ్ కోర్సులలో చదువుతున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ, కాపు, మైనారిటీ విద్యార్థులకు తొలివిడతగా నిధులు విడుదలైనట్లు పేర్కొన్నారు. జిల్లాలో 3187 మంది ఎస్సీ విద్యార్థులకు రూ.3,55,27,987లు, 1221 మంది ఎస్టీ విద్యార్థులకు రూ.2,43,34,944లు, 39509 మంది బీసీ విద్యార్థులకు రూ.28,24,79,131లు, 867 మంది ఈబీసీ విద్యార్థులకు రూ.54,68,327లు, 134 మంది మైనారిటీ విద్యార్థులకు రూ.9,29,146లు, 723 మంది కాపు విద్యార్థులకు రూ.69,34,620లు, 16 మంది క్రిస్టియన్ మైనారిటీ విద్యార్థులకు రూ.1,89,324 కళాశాలల ఖాతాలకు జమ చేసినట్లు వివరించారు.

దోపిడీకి విఫలయత్నం

- యాచనకు వచ్చినట్లు నటించి మహిళపై దాడి
- సీపన్నాయుడుపేటలో కలకలం



బాధితురాలు జయలక్ష్మి

శ్రీకాకుళం: నగర సమీపంలోని సీపన్నాయుడుపేట వద్ద జాతీయ రహదారికి ఆనుకున్న ఉన్న ఇంట్లో మహిళపై గుర్తు తెలియని ముగ్గురు వ్యక్తులు దాడికి పాల్పడ్డారు. గురువారం ఉదయం జరిగిన ఈ ఘటన స్థానికంగా కలకలం రేపింది. వివరాల్లోకి వెళ్తే.. జయలక్ష్మి దంపతులు జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న స్థలంలో కిందన షాపు, పైన రెండు ఇళ్లు నిర్మించుకున్నారు. రెండో అంతస్థులో జయలక్ష్మి కుటుంబం నివాసముంటోంది. గురువారం ఉదయం కుటుంబ సభ్యులంతా బయటకు వెళ్లగా జయలక్ష్మి ఒక్కరే ఉన్నారు. ఆ సమయంలో ఓ మహిళ వచ్చి యాచనకు వచ్చానని, బియ్యం వేయాలని కోరింది. ఇప్పుడు సాధ్యం కాదని చెప్పి జయలక్ష్మి ఇంట్లోకి వెళ్లిపోయింది. పది నిమిషాల తరువాత బట్టలు ఆరబెట్టేందుకు బయటకు రాగా.. యాచనకు వచ్చిన మహిళతో పాటు మరో ఇద్దరు వ్యక్తులు మెట్లపై ఉండటం గమనించింది. ఇంకా ఇక్కడే ఎందుకు ఉన్నారని ప్రశ్నిస్తుండగానే ఇద్దరు వచ్చి జయలక్ష్మి చేతులు పట్టుకోగా.. వారితో వచ్చిన మహిళ బంగారం దోచుకునేందుకు ప్రయత్నించింది. ఈ దశలో జరిగిన పెనుగులాటలో జయలక్ష్మి ముఖం, చేతులపై గాయాలయ్యాయి. ఆమె కేకలకు చుట్టుపక్కల వారు పరుగున వచ్చేసరికి మెట్లపైనుంచి మొదటి అంతస్థు వరకు వచ్చిన యాచకులు అక్కడి నుంచి దూకి బైక్‌పై పరారయ్యారు. విషయం తెలుసుకున్న రెండో పట్టణ సీఐ ఘటనా స్థలానికి చేరుకుని సమీపంలోని సీసీ కెమెరాలను పరిశీలించారు. ఆ సమయంలో మంచు కురవడం వల్ల నిందితులను గుర్తించటం కష్టంగా ఉందని చెబుతున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉత్సాహంగా గ్రిగ్స్ ఫైనల్స్ పోరు

- బాలికల విభాగంలో గేమ్స్ చాంపియన్‌గా పలాస ఎంజేపీ స్కూల్
- నేడు బాలబాలికలకు అథ్లెటిక్స్ నిర్వహణ



టెన్నికాయిట్ విజేత పలాస జీహెచ్ స్కూల్ విద్యార్థులు



గేమ్స్ చాంపియన్‌గా బహుమతులు అందుకుంటున్న పలాస ఎంజేపీ స్కూల్ జట్టు

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లాస్థాయి పాఠశాలల గ్రిగ్స్ ఫైనల్స్ క్రీడా పోటీలు ఆద్యంతం ఉత్సాహంగా సాగుతున్నాయి. జిల్లా విద్యాశాఖ పరిధిలోని పాఠశాలల క్రీడల సంఘం ఆధ్వర్యంలో శ్రీకాకుళం కోడిరామ్మూర్తి స్టేడియంలో జరుగుతున్న అంతర్ జోనల్ పాఠశాలల గ్రిగ్స్ క్రీడా పోటీల్లో జోనల్ స్థాయిలో విజేతలగా నిలిచిన క్రీడాకారులు/జట్లు ప్రాతినిధ్యం వహిస్తున్న విషయం తెలిసిందే. తొలిరోజు బాలురకు పోటీలు నిర్వహించగా.. గురువారం బాలికల పోటీలను జరిగాయి.

8 క్రీడాంశాల్లో బాలికలకు పోరు..

బాలికలకు ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, బాల్ బ్యాడ్మింటన్, టెన్నికాయిట్, బ్యాడ్మింటన్, త్రోబాల్, హ్యాండ్‌బాల్ క్రీడాంశాల్లో పోటీలు జరిగాయి. శుక్రవారం బాలబాలికలకు ఇదే మైదానం వేదికగా అథ్లెటిక్స్ ఈవెంట్స్ జరుగుతాయని పాఠశాలల క్రీడల సంఘం గ్రిగ్స్ సెక్రటరీ కె.మాధవరావు తెలిపారు. విజేతలకు వ్యాయామ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు మొజ్జాడ వెంకటరమణ, ప్రధాన కార్యదర్శి ఎం.సాంబమూర్తి, ముఖ్య సలహాదారు పి.సుందరరావు, గ్రిగ్స్ సెక్రటరీ కె.మాధవరావు, ఎస్‌జీఎఫ్ సెక్రటరీ బీవీ రమణ, పి.తవిటియ్య, మెట్ట తిరుపతిరావు, కె.రాజారావు, ఎం.ఆనంద్‌కిరణ్, గురుగుబెల్లి రాజశేఖర్, ఆర్.సతీష్‌రాయుడు,డి.ఈశ్వరరావు, శ్రీనివాసరావు, గజేంద్ర, స్వీటీ, అభినందించారు.

విజేతలు వీరే..

కబడ్డీ: విజేతగా ఎంజేపీ స్కూల్ పలాస, రన్నరప్‌గా జెడ్పీహెచ్‌స్కూల్ కురుడు

ఖోఖో: విజేతగా ఎంజేపీ స్కూల్ పలాస, రన్నరప్‌గా ఎంపీయూపీ స్కూల్ ఎం.సున్నాపల్లి

వాలీబాల్: విజేతగా ఏపీమోడల్ స్కూల్ రాజపురం, రన్నరప్‌గా జెడ్పీహెచ్ స్కూల్ బొంతలకోడూరు

బాల్ బ్యాడ్మింటన్: విజేతగా ఏపీఎస్‌డబ్ల్యూఆర్ స్కూల్ ఎచ్చెర్ల, రన్నరప్‌గా జెడ్పీహెచ్ స్కూల్ అంపోలు

బ్యాడ్మింటన్: విజేతగా జెడ్పీహెచ్ స్కూల్ అంపోలు, రన్నరప్‌గా జెడ్పీహెచ్ స్కూల్ వెంకటాపురం

టెన్నికాయిట్: విజేతగా జీహెచ్ స్కూల్ పలాస,రన్నరప్‌గా ఎంజేపీ స్కూల్ పలాస

త్రోబాల్: విజేతగా జెడ్పీహెచ్ స్కూల్ కొత్తపేట, రన్నరప్‌గా జెడ్పీహెచ్ స్కూల్ లంకపేట

హ్యాండ్‌బాల్: విజేతగా జెడ్పీహెచ్ స్కూల్ నారువ, రన్నరప్‌గా జెడ్పీహెచ్ స్కూల్ అల్లినగరం



త్రోబాల్ విజేత కొత్తపేట జెడ్పీహెచ్ స్కూల్ జట్టు



హ్యాండ్‌బాల్ రన్నరప్ అల్లినగరంజెడ్పీహెచ్ స్కూల్ జట్టు



బ్యాడ్మింటన్ విజేత అంపోలు జెడ్పీహెచ్‌స్కూల్ జట్టు

వైఎస్సార్ కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుల నియామకం

శ్రీకాకుళం (పీఎస్ కాలనీ): జిల్లాలో పలు మండలాలకు వైఎస్సార్ కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షులను నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం గురువారం ఒక ప్రకటన విడుదల చేసింది. పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు వీరిని నియమించారు.



మండలం	పేరు
ఎచ్చెర్ల నియోజకవర్గం	
ఎచ్చెర్ల	బోర సాయిరాం
లావేరు	దన్నాన రాజినాయుడు
జి.సిగడాం	డోల వెంకటరమణ
రణస్థలం	గొర్లె శ్రీనివాసరావు
ఇచ్ఛాపురం నియోజకవర్గం	
ఇచ్ఛాపురం మున్సిపాలిటీ	ప్రకాశరావు పట్నాయక్
ఇచ్ఛాపురం	పాతిర్ల రాజశేఖరరెడ్డి
సోంపేట	శిలగాన భాస్కరరావు
కవిటి	కడియాల ప్రకాశ్
కంచిలి	వజ్జ మృత్యుంజయరావు
నరసన్నపేట నియోజకవర్గం	
నరసన్నపేట	లుకలాపు రవికుమార్
పోలాకి	కణితి కృష్ణారావు
జలుమూరు	కనుసు సీతారాం
సారవకోట	వరుదు వంశీకృష్ణ
శ్రీకాకుళం నియోజకవర్గం	
శ్రీకాకుళం రూరల్	చిట్టి జనార్దనరావు
గార	పీస గోవిందరాజులు
టెక్కలి నియోజకవర్గం	
టెక్కలి నగరం	తమ్మన్నగారి కిరణ్
టెక్కలి	హనుమంతు వెంకటేశ్వరరావు
నందిగాం	తమిరి ఫల్గుణరావు
కోటబొమ్మాళి	సంపతిరావు హేమసుందరరాజు
సంతబొమ్మాళి	బుద్ధ మోహన్‌రెడ్డి
పాతపట్నం నియోజకవర్గం	
పాతపట్నం	సవిరిగాన ప్రదీప్
మెళియాపుట్టి	పోలాకి జయమునిరావు
ఎల్.ఎన్.పేట	పెనుమజ్జి విష్ణుమూర్తి
కొత్తూరు	గండివలస ఆనందరావు
హిరమండలం	మీసాల వెంకట రామకృష్ణ